క్లుప్తంగా

రూ.2.12 లక్షల నగదు స్వాధీనం

నల్లజర్ల: బైక్‌పై తరలిస్తున్న రూ.2.12 లక్షల నగదును మండలంలోని కవులూరు గ్రామం వద్ద సోమవారం రాత్రి ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం స్వాధీనం చేసుకుంది. కీర్తన ఫైనాన్స్ అనే సంస్థ సభ్యులు ఈ మొత్తాన్ని ఐ.యస్.జగన్నాథపురం నుంచి నల్లజర్లకు తీసుకు వస్తుండగా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఫ్లెయింగ్ స్క్వాడ్ బృందం సభ్యుడు జె.గణేష్ తెలిపారు. ఈ విషయాన్ని ఈఎస్ఎంఎస్‌లో నమోదు చేసినట్టు ఆయన చెప్పారు.

ఓటర్లను చైతన్య పరిచేందుకు ముగ్గుల పోటీలు

గోపాలపురం: ఓటర్లను చైతన్య పరిచేందుకు ఎన్నికల అధికారులు ప్రతి గ్రామంలోనూ మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ముగ్గులు పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలైన మహిళలకు ట్రైనీ కలెక్టర్ పి.సువర్ణ బహుమతులు అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ ఎస్.కృష్ణ, ఎంపీడీఓ కె. రమేష్‌బాబు పోటీలను పర్యవేక్షించారు.

ఆర్యవైశ్యులపై చంద్రబాబు క్షమాపణ చెప్పాలి

నల్లజర్ల: ఆర్యవైశ్యులను కించపరిచేలా మాట్లాడిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తక్షణం వారికి బహిరంగ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొమ్మండ్రు రమేష్ డిమాండ్ చేశారు. నల్లజర్లలో సోమవారం ఆయన కిరణా వర్తకులు, ఆర్యవైశ్యులతో కలసి విలేకరులతో మాట్లాడారు. కిరణా షాపుల్లో ఆర్యవైశ్యులు గంజాయి విక్రయిస్తున్నట్టుగా చంద్రబాబు చేసిన తప్పుడు ఆరోపణల వల్ల ఆ సామాజికవర్గం వారి మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఆర్యవైశ్యులంతా నీతిగా వ్యాపారాలు చేసుకుంటూ సేవా కార్యక్రమాల్లో కూడా ముందుంటారన్నారు. అలాంటి సామాజిక వర్గీయులను గంజాయి విక్రయదారులుగా చిత్రీకరించడం 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న చంద్రబాబుకు తగదని రమేష్ అన్నారు.

శ్రీనివాస్‌నాయుడికి మద్దతుగా కుమారుడి ప్రచారం



ముక్కామలలో వృద్ధుడి ఆశీర్వాదం తీసుకుంటున్న వరుణ్ సాయి

పెరవలి: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాంగా వైఎస్సార్ సీపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడి కుమారుడు వరుణ్‌సాయి సోమవారం మండలంలోని ముక్కామల గ్రామంలో తన తండ్రికి మద్దతుగా ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి ఈ ఐదేళ్లలో ఎటువంటి అవినీతికీ పాల్పడకుండా పాలన సాగించారన్నారు. కులమతాలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేశారన్నారు. మరోసారి అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని, అందుకు అందరి సహకారం కావాలన్నారు. ప్రచారంలో సర్పంచ్ కేతా త్రిమూర్తులు, ఎంపీటీసీ సభ్యుడు గండేపల్లి రామకృష్ణ, వేంద్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ఆదినారాయణ..

నిడదవోలు: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే కేవలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని 13వ వార్డు ఇందిరానగర్‌లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి పట్టణంలో చేపట్టిన అభివృద్ధి, ఐదేళ్లుగా ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి జి.శ్రీనివాస్‌నాయుడిని నిడదవోలు ఎమ్మెల్యేగా, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను రాజమహేంద్రవరం ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముంగండి కృపానందం, మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు బిర్రె పార్వతి, గోపిరెడ్డి శ్రీనివాస్, పార్టీ పట్టణ కార్యదర్శి గాజుల రంగారావు, తోలేటి కోటేశ్వరరావు, బిర్రె రామకృష్ణ, చిలకల మల్లికార్జునరావు, మానుపాటి తేజ, పుష్పరాణి, గృహ సారధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం సీసాలతో ముగ్గురి అరెస్ట్

దేవరపల్లి: ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో అధికారులు సోమవారం దాడులు నిర్వహించి ముగ్గురిని అరెస్ట్ చేశారు. సీఐ కె.వెంకటేశ్వరస్వామి కథనం ప్రకారం దేవరపల్లి మండలం యర్నగూడెంలో ఒక వ్యక్తి నుంచి 55 మద్యం సీసాలను స్వాధనం చేసుకుని అరెస్ట్ చేసినట్టు ఆయన తెలిపారు. గోపాలపురం మండలం జగన్నాథపురంలో ఒక వ్యక్తి నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు చెప్పారు. గోపవరంలో ఒక వ్యక్తి నుంచి 35 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్టు సీఐ వెంకటేశ్వరస్వామి తెలిపారు. ఆరుగురు పాత ముద్దాయిలను గోపాలపురం తహసీల్దార్ ఎదుట హాజరుపర్చినట్టు చెప్పారు. ఈ దాడుల్లో ఎస్సై పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుపై చల్లారని ఆగ్రహం

- కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు
- కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా ఇదే తీరు
- ఎండీపీడీవోలు, కార్యదర్శులకు రాజీనామా లేఖల అందజేత



నిడదవోలు మండలం మునిపల్లి గ్రామంలో రాజీనామా చేసిన వలంటీర్లకు సర్పంచ్ నరేష్, వార్డు సభ్యుల మద్దతు



రాజీనామా పత్రాలను సచివాలయ కార్యదర్శికి సమర్పిస్తున్న పెరవలి మండలం ఖండవల్లి వలంటీర్లు



గోపాలపురంలో ఎంపీడీఓ రమేష్‌బాబుకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న గుడ్డిగూడెం వలంటీర్లు

నిడదవోలు: పండుటాకులు, పేదలకు సేవ చేయకుండా కుట్ర పన్ని, వారి సేవల నుంచి తమను దూరం చేసిన విపక్ష నేత చంద్రబాబునాయుడిపై గ్రామ వలంటీర్ల ఆగ్రహం చల్లారలేదు. ఐదేళ్లుగా తాము నిస్వార్థంగా చేస్తున్న సేవలకు తెలుగుదేశం పార్టీ అధినేత రాజకీయ రంగు పులమడాన్ని వలంటీర్లు జీర్ణించుకోలేకపోతున్నారు. అందుకే ఉద్యోగాలను తృణప్రాయంగా వదిలేస్తున్నారు. కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. నిడదవోలు పట్టణంలో సోమవారం 23 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. మున్సిపల్ మేనేజర్ బి. శ్రీలక్ష్మికి వారు తమ రాజీనామా పత్రాలు అందించారు. వాటిని మున్సిపల్ అధికారులు ఆమోదించారు. లోగడ పట్టణంలో 86 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ సందర్భంగా రాజీనామా చేసిన వలంటీర్లు మాట్లాడుతూ కులమతాలు, పార్టీలు, వర్గాలు చూడకుండా నిష్పక్షపాతంగా తాము ప్రజలకు సేవ చేశామన్నారు. కానీ ఇప్పుడు తమ పట్ల టీడీపీ, జనసేన నాయకులు దుర్మార్గంగా వ్యవహరిస్తూ ప్రజలకు సేవ చేసే అవకాశం లేకుండా చేశారన్నారు. అందుకే స్వచ్ఛందంగా రాజీనామాలు చేస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ గెలుపు కోసం కృషి చేస్తామని ప్రకటించారు.

మునిపల్లిలో 12 మంది..

నిడదవోలు రూరల్: వలంటీర్ మళ్లీ ఇంటికి రావాలంటే జగనన్న సీఎం కావాలని మునిపల్లి సర్పంచ్ వెలగన నరేష్ అన్నారు. మండలంలోని మునిపల్లి సచివాలయం పరిధిలోని 12 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. వలంటీర్లకు సర్పంచ్ నరేష్, వార్డు సభ్యులు మద్దతు ప్రకటించారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేసి సీఎంగా జగనన్నను మళ్లీ గెలిపించుకుంటామని వలంటీర్లు స్పష్టం చేశారు.

పెరవలి మండలంలో మరో 94 మంది..

పెరవలి: మండలంలోని 94 మంది గ్రామ వలంటీర్లు తాజాగా తమ ఉద్యోగాలకు గుడ్ బై చెప్పారు. వారు తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శులకు, ఎంపీడీవో కె.హిమమహేశ్వరికి సోమవారం అందజేశారు. ఖండవల్లి పంచాయతీ పరిధిలోని 38 మంది, తీపర్రు పంచాయతీ పరిధిలోని 20 మంది, నడుపల్లి పంచాయతీ పరిధిలోని 18 మంది, ఇతర పంచాయతీల పరిధిలోని మరో 18 మంది వలంటీర్లు రాజీనామా చేసిన వారిలో ఉన్నారు. కాగా ఈ నెల 6న మండలంలోని వివిధ పంచాయతీల పరిధిలోని 171 మంది వలంటీర్లు రాజీనామాలు చేసిన సంగతి తెలిసిందే. దీంతో రాజీనామాలు చేసిన వారి సంఖ్య ఇప్పటికి 265కు చేరుకుంది. మండలంలోని 20 సచివాయాల పరిధిలో మొత్తం 399 మంది వలంటీర్లు ఉన్నారు.



నిడదవోలు మున్సిపల్ కార్యాలయం వద్ద రాజీనామా చేసిన వలంటీర్లు



తాళ్లపూడిలో ఎంపీడీవోకు రాజీనామా పత్రాలు అందిస్తున్న తిరుగుడుమెట్ట వలంటీర్లు

తాళ్లపూడి: మండలంలోని తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన 14 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. అలాగే ప్రక్కిలంకకు చెందిన 13 మంది వలంటీర్లు కూడా తమ రాజీనామా లేఖలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకటరమణకు అందజేశారు. ఇప్పటి వరకూ మండలంలో 64 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ ఏర్పడిన తరువాత తాము సేవలు అందజేస్తామని వారు చెప్పారు. రాజీనామా చేసిన వలంటీర్లలో ఖండవల్లి రమణ, కె.దీప్తి, ఖండవల్లి రమణమ్మ, యు.రుచిత, బత్తి సునీత, బొంతా మౌనిక , మిద్దే స్వాతి, చందు పద్మ, సతీష్, ఎలిపే పండు తదితరులు ఉన్నారు.

గుడ్డిగూడెంలో 13 మంది..

గోపాలపురం: మండలంలోని గుడ్డిగూడెం గ్రామ సచివాలయంలో పని చేస్తున్న 13 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. వారు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ కె.రమేష్‌బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ఎంతో ప్రతిష్టాత్మకంగా వలంటీర్ల వ్యవస్థను ప్రవేశ పెట్టారన్నారు. అయితే విపక్ష నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు గోనె సంచులు మోసే ఉద్యోగం అంటూ చేసిన వ్యాఖ్యలు తమను బాధించాయన్నారు.

సంక్షేమ యజ్ఞం సాగాలంటే ఫ్యాన్‌కే ఓటు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు శ్రీనివాస్‌నాయుడు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ విజ్ఞప్తి
- వెలగదుర్రు, తాడిపర్రు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం



తాడిపర్రు ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్

ఉండ్రాజవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల యజ్ఞం నిర్విఘ్నంగా కొనసాగాలంటే ప్రజలంతా ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తమను గెలిపించాలని వైఎస్సార్ సీపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ కోరారు. మండలంలో వెలగదుర్రు, తాడిపర్రు గ్రామాల్లో సోమవారం సాయంత్రం వారిద్దరూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థులిద్దరూ మాట్లాడుతూ సీఎం జగన్ నెలకొల్పిన సచివాలయ వ్యవస్థ వల్ల ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే అందుతున్నాయన్నారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చారన్నారు. పేద, బడుగు బలహీన వర్గాల ఆర్థికాభివృద్ధికి నవరత్నాల పథకాలు ఎంతగానో దోహదపడ్డాయని చెప్పారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఇద్దరినీ గెలిపించాలని వారు ప్రజలను అభ్యర్థిచారు. ఈ ప్రచారంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీటీసీ సభ్యులు కట్టా వెంకటేశ్వరరావు, ధనిశెట్టి భ్రమరాంబ, సాగి రామకృష్ణంరాజు, ముదునూరి సతీష్ వర్మ, కరుటూరి వెంకటేశ్వరరావు, ఎనుగుపల్లి వీర రాఘవులు, బొందల విశ్వేశ్వరరావు, అరిగెల సుబ్బారావు, గారపాటి లచ్చయ్య, కోడూరి హనుమంతరావు, కర్నె మారేసు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో అందరికీ లబ్ధి

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు
- 11వ వార్డులో ఇంటింటా ప్రచారం



కొవ్వూరు 11వ వార్డులో ఇంటింటా ప్రచారంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు

కొవ్వూరు: కులమతాలు, పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదే అని ఎమ్మెల్యే, ఆ పార్టీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు అన్నారు. పట్టణంలో 11వ వార్డులో సోమవారం ఆయన పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మరోసారి అధికారంలోకి వస్తే ప్రతి పేద వాడికీ మేలు చేకూరుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను గెలిపించాలని ఆయన కోరారు. ఈ ప్రచారంలో మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గంధం శేషసాయి, యూత్ అధ్యక్షుడు సిద్దన వాసు, కౌన్సిలర్లు బత్తి నాగరాజు, కంఠమణి రమేష్, తోట లక్ష్మీప్రసన్న, సూర్ల నగేష్, చొప్పా అప్పలనాయుడు, చిట్టూరి అన్నవరం, చీలి ప్రసాద్, గంగ్రోతు శివరామకృష్ణ, గంగాధర నాగేశ్వరరావు, మాసా ఆనంద్, గౌతమ్, బావన రాజేష్, బోడపాటి హనుమంతరావు, పార్టీ పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, బోడసింగి తులసి తదితరులు పాల్గొన్నారు.

నేడు 9వ వార్డులో ప్రచారం

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు మంగళవారం సాయంత్రం మూడు గంటల నుంచి పట్టణంలోని 9వ వార్డులో ప్రజాశీర్వాద యాత్ర పేరుతో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేస్తారని మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి సోమవారం తెలిపారు. కావున నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

9 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం



నల్లజర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ నరేష్‌కుమార్

నల్లజర్ల: ప్రస్తుత రబీ సీజన్‌లో మండలం నుంచి 9 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలనేది లక్ష్యమని మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ తెలిపారు. మండలంలోని శింగరాజుపాలెం, తెలికిచెర్ల, చీపురుగూడెం, జగన్నాథపురం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమల్‌రాజ్ మాట్లాడుతూ ధాన్యం సేకరణ కోసం 2.40 లక్షల గోనెసంచులను సిద్ధం చేశామన్నారు. వాటిలో 1.40 లక్షల గోనె సంచులను ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని చెప్పారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఒక హెల్పర్‌ను అందుబాటులో ఉంచామని తెలిపారు. జీపీఎస్ ఉన్న 48 వాహనాలను ధాన్యం రవాణాకు సిద్ధం చేసినట్టు చెప్పారు. కాగా ఎంపీడీఓ నరేష్‌కుమార్ నల్లజర్ల, పోతవరం, సుభద్రపాలెం, ప్రకాశరావుపాలెం గ్రామాల్లోను, తహసీల్దార్ కృష్ణారావు ఆవపాడు, తూర్పుచోడవరం, పడమర చోడవరం, కవులూరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

వనితకు మద్దతుగా కుటుంబీకుల ప్రచారం



ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనితకు మద్దతుగా తెలికిచర్లలో ప్రచారం

నల్లజర్ల: గోపాలపురం ఎమ్మెల్యేగా మన ఆడపడుచు, వైఎస్సార్ సీపీ అభ్యర్థి, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితమ్మను గెలిపించుకొని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని రెండో సారి ముఖ్యమంత్రిని చేసుకుందామంటూ ఆ పార్టీ నాయకులు, వనిత కుటుంబ సభ్యులు సోమవారం తెలికిచెర్ల గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. ఐదేళ్లుగా ప్రభుత్వం అందించిన పథకాలను, చేసిన అభివృద్ధి పనులను ఈ సందర్భంగా వారు గ్రామస్తులకు వివరించారు. మే13 న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలన్నారు. ప్రచారంలో వనిత కుటుంబ సభ్యులు ముప్పిడి సునీల్‌కుమార్, కొడవటి ఆశీర్వాదం, తెలికిచెర్ల సర్పంచ్ బండి చిట్టి, ఉప సర్పంచ్ నక్కా పండు, బంక అప్పారావు, లైటింగ్ పండు, ముప్పిడి వెంకటరత్నం, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, ఆచంట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అధిక మెజారిటీ లక్ష్యంగా పనిచేయాలి

- జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి
- వైఎస్సార్ సీపీ శ్రేణులతో సమావేశం



ఉండ్రాజవరం సమావేశంలో మాట్లాడుతున్న బూరుగుపల్లి సుబ్బారావు

ఉండ్రాజవరం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, నాయకుడూ పని చేయాలని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు అన్నారు. ఉండ్రాజవరంలోని ఆ పార్టీ కార్యకర్తలు, నాయకుల సమావేశాన్ని సోమవారం ఇక్కడి స్వర్గీయ బూరుగుపల్లి చిన్నారావు నివాసంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యం అన్నారు. గతంలో కంటే మెజార్టీ పెంపుపై పార్టీ శ్రేణులు దృష్టి సారించాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. కూటమి పార్టీల నాయకుల బూటకపు హామీలను తిప్పికొట్టాలని సూచించారు. సమావేశంలో సర్పంచ్ మెండే వెంకట్రావు, వైస్ ఎంపీపీ ఎస్.సరోజ, ఎంపీటీసీ సభ్యులు గాడి కృష్ణవేణి, బూరుగుపల్లి భాస్కరరావు, బీఎస్సార్ యూత్ సభ్యులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పాలంగి గ్రామంలో వైఎస్సార్ సీపీ గ్రామ స్థాయి నాయకుల, కార్యకర్తల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ వెలిచేటి జానకీరామయ్య, పాలాటి శరత్‌బాబులు ప్రస్తుత ఎన్నికల్లో అభ్యర్థుల విజయం సాధించడానికి ప్రతి కార్యకర్త, నాయకులు కృషి చేయాలని సమావేశంలో దిశా నిర్దేశం చేసారు. సర్పంచ్ బొక్క శ్రీనివాస్, దొడ్డా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్లలో నకారా జయంతి



నకారా జయంతిలో కేక్ కట్ చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

నల్లజర్ల: రిటైర్డ్ ఉద్యోగులకు పూర్తిస్థాయిలో పెన్షన్ లభించేలా పోరాడి, సాధించిన ఘనత ధరం స్వరూప నకారాదే అని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల శాఖ అధ్యక్షుడు ఇమ్మణ్ణి వెంకటసత్యం అన్నారు. నకారా జయంతిని సోమవారం నల్లజర్లలోని మండల విద్యావనరుల కేంద్రంలో ఐవీ సత్యం అధ్యక్షతన నిర్వహించారు. 1979, మార్చి 31కి ముందు రిటైరైన కేంద్ర ప్రభుత్వోద్యోగులు పెన్షన్‌కు అర్హులు కారంటూ అప్పటి కేంద్ర ప్రభుత్వం నిరాకరించిందని సత్యం గుర్తు చేశారు. దానిని సవాల్ చేస్తూ నకారా సుప్రీం కోర్టులో రిట్ వేయగా ప్రధాన న్యాయమూర్తి వైవీ చంద్రాచూడ్ పెన్షనర్లకు అనుకూలలంగా చారిత్రాత్మక తీర్పు చెప్పారన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో కొణతం లక్ష్మీనారాయణ, ఐడీపీ అప్పారావు, ఏసురత్నం, ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, ప్రభుదాస్, ఏసురత్నం, బాలయ్య, నెక్కలపూడి ప్రతాప్, సుంకర దత్తు, రాజేంద్రప్రసాద్, కేజేడీపీ ప్రసాద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్వామివారి పుష్ప యాగోత్సవం

నిడదవోలు: స్థానిక బాలా త్రిపుర సుందరీ సమేత సోమేశ్వర స్వామి గుడిలో స్వామివారి కల్యాణోత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారి పుష్పయాగోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు తరలి వచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.







